



నగరం పిలుస్తోంది

పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణం నగరంగా మారే రోజు దగ్గరలోనే కనిపిస్తోంది. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మునిసిపల్ అధికారులకు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) దిశా నిర్దేశం చేశారు. ఆర్థికంగా సంపన్నమై.. ఆక్వా రంగానికి హబ్‌గా వెలుగొందుతున్న ఈ పట్టణం జనాభాలోనే కాదు.. విద్యా సంస్థలతో జిల్లా అగ్రగామిగా వుంది. మునిసిపాల్టీ కార్పొరేషన్‌గా ఎదిగేందుకు అవసరమైన అన్ని అర్హతలు ఈ పట్టణానికి వున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కదలిక మొదలైంది. ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..



కార్పొరేషన్ దిశగా భీమవరం అడుగులు

- నిలిచిన విలీన ప్రక్రియకు కదలిక
- అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి
- అన్ని అవకాశాలు ఉన్నాయి
- ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే అంజిబాబు దిశా నిర్దేశం





భీమవరం టౌన్, జూలై 4 : అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన పట్టణం భీమవరం. ఇది కార్పొరేషన్‌గా గుర్తింపు పొందితే నిధులు అధికంగా వచ్చే అవకాశం ఉంది. కేంద్ర నిధులు పెరుగుతాయి. రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెడుతుంది. కూటమి అధికారంలోకి వస్తే భీమవరాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామని ఇప్పటికే నేతలు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే అంజిబాబు తన హయాంలో పట్టణాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

ఆదాయం రూ.30 కోట్లు

భీమవరం ఆదాయపరంగా ఎంతో అభివృద్ధి చెందింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అపార్ట్‌మెంట్ సంస్కృతి ఇక్కడే అధికం. ఆస్తి పన్ను రూపంలోను ఏటా రూ.23 కోట్ల ఆదాయం లభిస్తోంది. నీటి పన్ను, మార్కెట్ పన్ను, ఇతర మార్గాల ద్వారా మరో ఏడు కోట్లు లబ్ధి చేకూరుతోంది. మొత్తంగా మునిసిపాల్టీకి దాదాపు రూ.30 కోట్ల నికర ఆదాయం ఉంది. కార్పొరేషన్‌గా మారేందుకు దీనిని కూడా పరిగణనలోకి తీసుకుంటారు.

మెరుగైన రవాణా సౌకర్యం

భీమవరం నుంచి జిల్లాలోని అన్ని పట్టణాలకు బస్సు సౌకర్యం ఉంది. రహదారి వ్యవస్థ అభివృద్ధి చెందింది. మరో వైపు ప్రధాన నగరాలైన అమరావతి, విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు, చెన్నాయ్, విశాఖపట్నం వంటి నగరాలకు పయనించేలా బస్సు సౌకర్యాలు ఉన్నాయి. ఈ పట్టణం మీదుగా జాతీయ రహదారులు అభివృద్ధి చెందుతున్నాయి. ఇప్పటికే ఆకివీడు నుంచి పాలకొల్లు వరకు జాతీయ రహదారికి మార్గం సుగమమైంది. విశాఖకు వెళ్లేందుకు జాతీయ రహదారి ప్రణాళిక ఉంది. తాడేపల్లిగూడెం-భీమవరం నుంచి ప్రయాణించే రహదారిని కేంద్రం జాతీయ రహదారిగా గుర్తించింది. రానున్న రోజుల్లో జాతీయ రహదారిగా అభివృద్ధిచెందనుంది. భీమవరం మీదుగా రైల్వే మార్గం విస్తరించింది. ప్రధాన నగరాలకు రైలు సౌకర్యం ఉంది. ఇటీవల కాలంలోనే డబుల్ లైన్, విద్యుద్దీకరణ పూర్తయింది. రైళ్ల రద్దీ పెరిగింది. గూడ్స్ రైళ్లను ఈ మార్గంలో పంపిస్తున్నారు. త్వరలో వందే భారత్ ఈ పట్టణం మీదుగా పరుగులు తీయనుంది. కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయ్యేందుకు ఇది కూడా ప్రధాన అంశమే.

జిల్లా కేంద్రం మరో వరం

భీమవరం జిల్లా కేంద్రం కావడంతో కార్పొరేషన్ గుర్తింపు నకు దోహదపడనుంది. జిల్లా కేంద్రమైన తర్వాత ఈ పట్టణానికి రాకపోకలు పెరిగాయి. దీనిని జిల్లా కేంద్రంగా గుర్తించినప్పటికీ వైసీపీ ప్రభుత్వ హయంలో ఎలాంటి నిధులు కేటాయించలేదు. అభివృద్ధి చేయలేదు. కేవలం కలెక్టరేట్‌కు మార్కెట్ కమిటీ స్థలాన్ని కేటాయిస్తూ జీవో జారీ చేశారు తప్ప అంతకుమించి ఒరిగింది ఏమీ లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పట్టణానికి మహర్దశ పడుతుందని బావిస్తున్నారు. ఇప్పటికే పలు జిల్లా కేంద్రాలు కార్పొరేషన్‌గా అభివృద్ధి చెందాయి.

విద్యా రంగంలో మేటి

కార్పొరేషన్‌గా గుర్తింపు పొందాలంటే విద్యా రంగాన్ని ప్రాధాన్యతాంశంగా తీసుకుంటారు. భీమవరం విద్యా రంగంలో ముందుకు సాగుతోంది. ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు ప్రాథమిక, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలు పెద్ద సంఖ్యలో వున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి విద్యార్థులు భీమవరం తరలి రావడంతో విద్యా రంగం మరింత ముందుకు వెళుతోంది. డీఎన్ఆర్, ఎస్ఆర్‌కేఆర్, డాక్టర్ బీవీ రాజు విద్యా సంస్థలు రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే మంచి గుర్తింపు పొందాయి.

నిలిచిన విలీన ప్రక్రియ

గతంలో కార్పొరేషన్‌కు ప్రయత్నాలు సాగాయి. పట్టణానికి సమీపంలో వున్న తాడేరు, రాయలం, చిన అమిరం, కొవ్వాడ-అన్నవరం గ్రామాలను విలీనం చేసేందుకు ప్రభుత్వం గెజిట్‌ను 2020 డిసెంబరు 31న విడుదల చేశారు. ఈ గ్రామాలను విలీనం చేయడం ద్వారా కార్పొరేషన్‌కు రంగం సిద్ధమైంది. దీంతో గతంలో జరగాల్సిన మునిసిపల్ ఎన్నికలు నిలిచిపోయాయి. కార్పొరేషన్‌గా ఎన్నికలు జరుగుతాయని అందరూ భావించారు. వార్డుల విభజన చేశారు. ఇంతలోనే విలీనంపై కోర్టులో కేసులు వెయడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో కార్పొరేషన్ విషయం పక్కకు వెళ్లిపోయింది. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కార్పొరేషన్ ప్రక్రియకు కదలిక వచ్చింది.

కార్పొరేషన్‌కు పూర్తిగా సహకరిస్తా

ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు

భీమవరం మునిసిపాల్టీని కార్పొరేషన్‌గా అభివృద్ధి చేసేందుకు పూర్తి సహకారం అందిస్తాం. ఈ ప్రక్రియ ఎక్కడ ఆగిపోయింది. కోర్టు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నా. ప్రభుత్వంతో మాట్లాడి ఈ సమస్యను పరిష్కరించి త్వరలోనే కార్పొరేషన్‌గా తీసుకుని వస్తాం.


మునిసిపల్ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు(ఫైల్)



పట్టణ ప్రగతిలో సోపానాలు

భీమవరం పట్టణం ప్రస్తుతం 39 వార్డులతో సెలక్షన్ గ్రేడ్ మునిసిపాల్టీగా కొనసాగుతోంది. ప్రస్తుతం 25.64 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. 2011 జనాబా లెక్కల ప్రకారం పట్టణ జనాబా లక్షా 42 వేల 184 మంది ఉండగా పురుషులు 71,083, మహిళలు 76,934 మంది ఉన్నారు. పట్టణంలో 95 వరకు హాస్పటల్స్ ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రి ఒకటి ఉండగా, ప్రైవేట్ ఆసుపత్రులు 75 వరకు ఉన్నాయి. అర్బన్ హెల్త్ సెంటర్లు ఐదు. ఐదు హోమియోపతి, నాలుగు ఆయుర్వేద హాస్పటల్స్ ఉన్నాయి. పశు వైద్యశాల ఒకటి ఉంది.

గునుపూడిలో ఉమా సోమేశ్వర జనార్ధనస్వామి ఆలయం, మావుళ్లమ్మ ఆలయం, చారిత్రాత్మిక భీమేశ్వర స్వామి ఆలయం ఉన్నాయి. విద్యాలయాలకు సంబంధించి 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 67 ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు 10, డిగ్రీ 4, పీజీ 6, ఇంజనీరింగ్ కళాశాలలు 6, పాలిటెక్నిక్ 1, ఐటీఐ కళాశాలలు 2 మొత్తం 31 కళాశాలలు ఉన్నాయి. డీఎన్ఆర్ విద్యాసంస్థలు, కేజీఆర్ఎల్ విద్యాసంస్థలు, ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల, డాక్టర్ బీవీ రాజు విద్యాసంస్థలు ప్రముఖంగా ఉన్నాయి.


వినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బంద్‌తో మూతపడిన స్కూళ్లు

భీమవరం ఎడ్యుకేషన్, జూలై 4 : నీట్ పరీక్ష పత్రాల లీక్‌లకు కారణమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) రద్దు చేయాలని, పరీక్ష రాసి నష్టపోయిన విద్యార్థులకు నష్టపరిహారం చెల్లించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నూతన విద్యావిధానం పేరిట దేశవ్యాప్తంగా పాఠశాలల మూసివేతను ఆపాలని ఎస్ఎఫ్ఐ భీమవరం పట్టణ కార్యదర్శి గణేష్ అన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీను నిరసిస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. పట్టణ నాయకులు బి.చిరంజీవి, ఎం.యశ్వంత్, ఎన్.ప్రతాప్, బి.వంశీ, బి.రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో ఆసుపత్రుల తనిఖీ



భీమవరం క్రైం, జూలై 4 : రోగులు ఆసుపత్రులకు వచ్చినప్పుడు వారితో దయతో మెలగాలని ప్రభుత్వపరంగా ఆరోగ్యశ్రీలో అందించే సేవలన్నీ సకాలంలో అందించడంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మహేశ్వరరావు ఆసుపత్రుల యాజమాన్యాలకు సూచించారు. ప్రైవేటు ఆసుపత్రుల సాధారణ తనిఖీల్లో భాగంగా ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్న శ్రీలక్ష్మీ ఆసుపత్రి, అవినాష్ ఆర్థోపెడిక్, ట్రామాకేర్ సెంటర్, రాజర్షి ఆసుపత్రులను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రోగులకు సేవలు సక్రమంగా అందుతున్నాయా లేనిదీ ప్రత్యక్షంగా రోగులతో మాట్లాడి తెలుసుకున్నారు. సేవలు బాగానే ఉన్నాయని రోగులు తెలిపారు. జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.కీర్తి కిరణ్ ఉన్నారు.



మావుళ్లమ్మకు ఉయ్యాల సేవ

భీమవరం టౌన్, జూలై 4 : మావుళ్లమ్మ జ్యేష్ఠమాస జాతర గురువారంతో ముగిసింది. బుధవారం రాత్రి దేవస్థానం ఆధ్వర్యంలో అమ్మవారికి జాతర నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారి గరగలను ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు మల్లికార్జున శర్మ ప్రత్యేకపూజలు చేశారు.అమ్మవారి అత్తింటి, పుట్టింటి వారు మెంటే, అల్లూరి వంశస్తులు పూలతో అలంకరించిన ఊయ్యాలలో ఉంచిన గరగలకు ఊయ్యాల సేవ నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో గరగలను అమ్మవారి పాదాల చెంత ఉంచడంతో సేవ ముగిసింది. ఈవో బుద్దా మహాలక్ష్మి నగేష్, సిబ్బంది పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న కలెక్టర్ నాగరాణి

అల్లూరి సేవలు స్ఫూర్తిదాయకం

భీమవరం టౌన్, జూలై 4 :విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు చేసిన సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టరు నాగరాణి అన్నారు.గురువారం జిల్లా కలెక్టరేట్‌లో అల్లూరి సీతారామ రామరాజు జయంతి నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. తెల్లదొరల దోపిడీ ఎదుర్కోవడానికి గిరిజనులకు అండగా నిలిచి పోరాడిన గొప్ప యోధుడు అల్లూరి అని అన్నారు. అల్లూరి తిరిగిన నేలపై విధులు నిర్వహించడం గొప్ప అనుభూతిని కలిగించిందన్నారు. జేసీ ప్రవీణ్ ఆదిత్య, డీఆర్వో ఉదయ భాస్కరరావు, జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జి.గణపతిరావు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పాలకోడేరు: అల్లూరి సీతారామరాజును ఆదర్శంగా తీసుకుని చేతల్లో చూపిస్తూ ముందుకు రావాలని ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. అల్లూరి పురిటిగడ్డ అయిన పాలకోడేరు మండలం మోగల్లులోని ఆయన స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు మాట్లాడుతూ అల్లూరి ఆశయాలను నెరవేర్చే విధంగా యువత నడుం బిగించాలన్నారు. సర్పంచ్ కృష్ణకుమారి, రాగూర్ కోటేశ్వరరాజు, కొత్తపల్లి నాగరాజు, కలిదిండి సందీప్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.


మోగల్లులో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు తదితరులు

టిడ్కో సముదాయాల్లో మహిళా మార్ట్‌లు


భీమవరం టిడ్కో ఇళ్ల వద్ద నిర్మాణ ప్రక్రియ

భీమవరం,తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో ఏర్పాటు

భీమవరం టౌన్, జూలై 4 :టిడ్కో ఇళ్లపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. అక్కడ ఉంటున్న లబ్ధిదారులకు అన్ని వసతులు కల్పించాలని నిర్ణయించింది. పెండింగ్‌లో ఉన్న పనులను పునఃప్రారంభించింది. తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే టిడ్కో ఇళ్లపై కదలిక వచ్చింది. తాజాగా మహిళా మార్ట్‌లను ఏర్పాటు చెయ్యాలని ఏపీ టిడ్కోకు ప్రభుత్వం ఆదేశించింది. వాస్తవానికి వైసీపీ ప్రభుత్వంలో రూ.7.03 కోట్లతో భీమవరం, తాడేపల్లిగూడెం, కాకినాడ రాజమహేంద్రవరం, అమలాపురం ప్రాంతాల్లో పనులను చేపట్టలేదు. ప్రసుత్తం మహిళా మార్టులుగా ఏర్పాటు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత పనులు చేపడుతున్నారు. స్వయం సహాయక సంఘాల ఆర్థిక సాయంతో నిర్వహణ చెయ్యవలసి ఉంటుంది. సంఘంలో సభ్యులు ఒక్కొక్కరి నుంచి రూ.150 వసూలు చేస్తారు. ఆ సొమ్ముతో మాల్ నిర్వహించి వచ్చిన లాభంలో మహిళా సంఘ సభ్యులకు పంపిణీ చేస్తారు. బయట మార్ట్‌లు ఎలా ఉన్నాయో అదే విధంగా ఇక్కడ ఏర్పాటు చేస్తారు. నిత్యావసర వస్తువులతో పాటు నిత్యం ఉపయోగించే ఇతర వస్తువులను ఇందులో ఏర్పాటు చేస్తారు. ఇందులో పని చేసేందుకు స్వయం సంఘాల సభ్యులను ఎంపిక చేస్తారని అంటున్నారు. మేనేజర్ స్థాయి, నిర్వహణకు సంబంధించిన వారికి మాత్రం చదువుకున్న వారికి అవకాశం కల్పిస్తారని చెబుతున్నారు. దీని ద్వారా కొంత ఉపాధిని పొందే అవకాశం ఉందని అంటు న్నారు. కొనుగోలు చేసిన సరుకులపై కొంత మార్జిన్ వేసుకుని అమ్మకాలు చేస్తారని అధికారులు చెబుతున్నారు.

ప్రస్తుతం కాకినాడలో మాత్రం పిల్లర్స్ వరకు పనులు జరిగాయి. భీమవరం, తాడేపల్లిగూడెంలో మాత్రం గ్రౌండ్ లెవెల్ పనులు జరుగుతున్నాయి. ఏది ఏమైనా మాల్స్ తయారయ్యేందుకు మరో ఆరునెలల సమయం పట్టే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వ హయాంలో ఈ మాల్స్ అందుబాటులోకి రానున్నాయి. చాలా టిడ్కో ఇళ్లలో ఇంకా చాలామంది లబ్ధిదారులకు ఇళ్లు అందించాల్సి ఉంది. పూర్తిస్థాయిలో లబ్ధిదారులు వస్తే మాత్రం ఈ మాల్స్ వారికి ఎంతగానో ఉపయోగపడనున్నాయి. పట్టణాలకు కొంత దూరంగా ఈ టిడ్కో గృహాలు ఉండటం కారణంగా ఈ విధానాన్ని తీసుకువచ్చారని అంటున్నారు. ప్రస్తుతం మాత్రం చిన్న దుకాణాలను లబ్ధిదారులే ఇళ్ల వద్ద ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు.



రైతుల ఖాతాల్లో రూ.523 కోట్లు


ధాన్యం బకాయిలు విడుదల చేసిన ప్రభుత్వం

భీమవరం,జూలై 4 (ఆంధ్రజ్యోతి) : రైతులకు కాస్త ఊరట లభించింది. ప్రభుత్వం ధాన్యం బకాయిలను విడుదల చేసింది. రైతు ఖాతాల్లో జమ చేసింది. ఫలితంగా రైతులు ఉపశమనం పొందారు. జిల్లాలో బుధవారం రైతులకు రూ.523 కోట్లు ఖాతాల్లో జమచేసింది. ఇంకా రూ.410 కోట్లు చెల్లించాల్సి ఉంది. వాస్తవానికి ఏప్రిల్, మే నెలల్లోనే ప్రభుత్వం రైతులకు బకాయిలు చెల్లించాలి. అప్పటి వైసీపీ ప్రభుత్వం దీనిని పెద్దగా పట్టించుకోలేదు. జిల్లాలో గడచిన రబీకి సంబంధించి 6.41 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అందుకు సంబంధించి రూ.1400 కోట్లు బకాయి పడింది.ఎన్నికల ముందు కేవలం రూ.420 కోట్లు మాత్రమే చెల్లించారు. మిగిలిన మొత్తాన్ని వాయిదా వేసింది. ఎన్నికల తరువాత కూడా రైతులను పట్టించుకోలేదు.గడచిన ఐదేళ్లలో రైతులకు చుక్కలు చూపించారు. ధాన్యం కొనుగోలు చేసే పౌరసరఫరాల కార్పొరేషన్‌లో పీకల్లోతు ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేసింది. చివరకు సకాలంలో సొమ్ములు చెల్లించకుండా రైతులకు అష్టకష్టాలు పెట్టింది. కూటమి అధికారంలోకి రావటంతో రైతుల బకాయిలపై దృష్టి పెట్టారు. తొలివిడతగా రూ.523 కోట్లు చెల్లించారు. మిగిలిన సొమ్ము త్వరలో విడుదల చెయ్యనున్నారు.

పెట్టుబడుల కోసం ఎదురు చూపులు

జిల్లాలో ఖరీఫ్ సాగు ముమ్మరంగా సాగుతోంది. వరి నాట్లు వెయ్యడంలో రైతులు నిమగ్నమయ్యారు. దమ్ము చేసేందుకు పెట్టుబడి కావలసి ఉంది. రైతులు చేసిన అప్పులను తీర్చలేకపోయారు. ఖరీఫ్ సాగుకు మళ్లీ పెట్టుబడి పెట్టాలంటే అప్పులు ఇచ్చేవారు కనిపించడం లేదు. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు సొమ్ములు విడుదల చేయడంతో కాస్త ఊపిరిపీల్చుకున్నారు. ప్రభుత్వం మిగిలిన సొమ్ములను విడుదల చేస్తేనే రైతులకు పూర్తిస్థాయిలో ఉపశమనం కలుగుతుంది.

చింత చిగురుతో ఆరోగ్యం 7



ప్రజల హృదయాల్లో నాటికలకు సుస్థిరస్థానం



రూ.35 లక్షలు పోయినా.. కేసు లేదు ?





కేంద్రమంత్రి అమిత్‌షాను కలిసిన సీఎం చంద్రబాబు, ఎంపీ పుట్టా తదితరులు

రాష్ట్రాభివృద్ధికి సహకరించండి

» కేంద్ర మంత్రులను కలసిన సీఎం చంద్రబాబు, ఎంపీ పుట్టా

ఏలూరుటూటౌన్, జూలై 4: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరారు. గురువారం కేంద్రమంత్రులు అమిత్‌షా, పియూష్‌గోయల్, శివరాజ్‌సింగ్ చౌహాన్, 14వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ గోనగర్యాలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహేష్ యాదవ్ రాష్ట్ర సమస్యలపై కేంద్ర మంత్రులకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర విభజన హామీల సమస్యలు పరిష్కరించాలని, అధిక నిధులు కేటాయించాలని, రాష్ట్రానికి జాతీయ రహదారులు, ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని, అనంతపురం నుంచి అమరావతి, హైదరాబాదు నుంచి అమరావతి వరకు రోడ్లు పూర్తి చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గట్కరీనీ కోరారు. కార్యక్రమంలో రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, చంద్రశేఖర్, శ్రీనివాసవర్మ తదితరులు ఉన్నారు.

12 నుంచి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

తణుకు, జూలై 4 : ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల్లోని చిట్టూరి సుబ్బారావు సత్య ఉషారాణి ఇండోర్ స్టేడియంలో ఈనెల 12 నుంచి 14 వరకు జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్టు కళాశాల కార్యదర్శి, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షురాలు చిట్టూరి సత్యఉషారాణి, సెక్రటరీ మెంటే వంశీకృష్ణ తెలిపారు. అండర్-11,13,15,17,19 వయస్సు గల బాలబాలికలకు పురుషులు, మహిళలు, వెటరన్స్ 35,45,50,60,65,70ప్లస్ వయస్సుల కేటగిరీలలో సింగిల్స్, డబుల్స్ విభాగాలలో పోటీలు జరుగుతాయని అసోసియేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కంటిపూడి రాంబాబు చెప్పారు. పోటీలలో విజేతలైన వారు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవుతారన్నారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు తమ ఎంట్రీలను ఎన్.సతీష్, 99597 96929, సుదర్శన్ 97014 04675 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

940 మంది విద్యార్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్



కౌన్సెలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

నూజివీడు టౌన్, జూలై 4 : రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో ప్రత్యేక కేటగిరీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కార్యక్రమానికి మొత్తం 940మంది విద్యార్థులు పాల్గొన్నారు. గురువారం నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ప్రత్యేక కేటగిరిలైన ఎన్‌సీసీ, క్రీడా విభాగాల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో ఎన్‌సీసీ విభాగంలో 590, క్రీడా విభాగంలో 350మంది విద్యార్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కార్యక్రమానికి హాజరయ్యారని అడ్మిషన్స్ కన్వీనర్ అమరేంద్రకుమార్ తెలిపారు.

ఉమ్మడి పశ్చిమలో 13,410 ఇంజనీరింగ్ సీట్లు

ఏలూరు అర్బన్, జూలై 4 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆయా కోర్సుల్లో అడ్మిషన్ల సంఖ్యపై అఖిలభారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) స్పష్టతనిచ్చింది, ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేసింది. కొత్తగా పలు ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలకు సీట్లను పెంచుతూ అనుమతులనిచ్చింది. ఆ ప్రకారం ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని 16 ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో మొత్తం 13,410 సీట్లు ఈ ఏడాది ఆయా కోర్సుల్లో అందుబాటులో ఉన్నాయి. వీటిలో 70 శాతం సీట్లను కన్వీనర్ కోటాలో భర్తీచేస్తారు. ఇప్పటికే ఇంజనీరింగ్ ప్రవేశాలకు వెబ్ ఆప్షన్లు, సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతున్న విషయం విదితమే.

నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు

» ఏలూరు జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా హెచ్చరిక



రికార్డులు తనిఖీ చేస్తున్న హబీబ్ బాషా

పెదవేగి, జూలై 4 : నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఏలూరు జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా విక్రయదారులను హెచ్చరించారు. పెదవేగి మండలం వేగివాడలో గురువారం సాయంత్రం ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువులు, పురుగుమందుల క్రయ, విక్రయాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాక్ రికార్డుతోపాటు విక్రయించిన ఎరువులు, పురుగుమందులతో పాటు మిగిలిన నిల్వలను బోర్డులో ప్రదర్శించాలని సూచించారు. ధరల పట్టికను విధిగా ప్రదర్శించాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విక్రయించిన వాటికి రైతులకు బిల్లులు తప్పనిసరిగా అందించాలన్నారు. తనిఖీల్లో ఏడీఏ వై.సుబ్బారావు, పెదవేగి ఏవో ఎం.ప్రియాంక పాల్గొన్నారు.

నేత్రపర్వం.. ఏకాదశ రుద్రాభిషేకం



ద్వారకాతిరుమల, జూలై 4: శ్రీవారి క్షేత్ర పాలకుడైన శివదేవుని ఆలయంలో గురువారం జరిగిన మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి జరిగిన నంది వాహనంపై తిరువీధిసేవ భక్తులను అలరించింది. లోక కల్యాణార్థం మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జరిగిన సేవ భక్తులకు కనువిందు చేసింది. ఆలయ గర్భాలయంలో కొలువైన శివయ్యకు అర్చకులు, పండితులు వేదమంత్రోచ్ఛరణల నడుమ రుద్రాభిషేకాన్ని జరిపారు. రాత్రి నంది వాహనంపై జరిగిన గ్రామోత్సవం చూపరులకు నేత్రపర్వమైంది.

ANDHRA JYOTHI CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి
DAILY CLASSIFIEDS
క్లాసిఫైడ్స్ (ప్రతిరోజు)

PLOTS FOR SALE

■ రాజధాని గుంటూరు విజయవాడలలో 15 వెంచర్లలో CRDA ఫ్లాట్స్, పూలింగ్ ల్యాండ్స్, అపార్ట్మెంట్స్, పొలాలు మీకు అందుబాటు ధరలలో కలవు. సంప్ర॥ సెల్: 9390451999 AJO-183939

CHANGE OF NAME

★ I, SREEVALLI DEVI, spouse of KOMMISETTI SATYANARAYANA, resident of Flat No.21/5, B-Block, Madhu Park Ridge Apartments, Beside Tipu Khan Bridge, I.B.Lines Post Office, Hyderabad-500031, have changed my name from SREEVALLI DEVI to KOMMISETTI VALLI DEVI vide Affidavit dated 18.06.2024 at SIRCILLA, Telangana State. AJH-13486

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవిటి

చింత చిగురుతో ఆరోగ్యం

» జోరుగా విక్రయాలు.. కిలో రూ.200-300

» గ్రామీణ మహిళలకు జీవనోపాధి



చింతచిగురు విక్రయిస్తున్న మహిళ.. (ఇన్‌సెట్‌లో) చింతచిగురు

గణపవరం, జూలై 4: చింతచెట్టు చిగురు చూడు.. చిన్నదాని పొగరు చూడు చింతచిగురు పుల్లగున్నదోయ్ చిన్నదేమో తియ్యగున్నదో అని ఒక సినీగేయ రచయిత రాసిన సినీగీతమే కాకుండా చింతచెట్టుపై అనేక సినిమా పాటలు రకరకాలుగా వచ్చాయి. చింతచిగురు వల్ల అనేక ఉపయోగాలు కవులు పాటలు రాశారు. జ్యేష్ఠ, ఆషాడమాసాల్లో లభించే చింతచిగురు దాని రుచి తెలిసిన వారికి చూస్తే చాలు వదలరు. ఎక్కడ ఉన్న మరీ తెచ్చుకుని ఆ రుచిని ఆస్వాదిస్తారనడంలో అతిశయోక్తిలేదు. ముఖ్యంగా పులుపు సంగతి ఎలా ఉన్న చింతచిగురు తినడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆయుర్వేదనిపుణులు స్పష్టం చేస్తున్నారు. పెళ్ళిళ్ళు, శుభకార్యాల్లో చింతచిగురుతో చేసిన వంటకాలు వడ్డించడం విశేషంగా చెబుతున్నారు. గ్రామీణ మహిళలకు చింతచిగురు ఒక ఉపాధిమార్గం. ఈ రెండు నెలల సీజన్‌లో పిల్లలు, మహిళలు చింతచెట్టు నుంచి చింతచిగురు సేకరించి ఇంటింటా తిరిగి, రహదారుల వెంబడి విక్రయిస్తున్నారు. ముఖ్యంగా వారపు సంతల్లో ఈ చింతచిగురు విక్రయాలు ఒక భాగమైంది. కిలో ధర రూ.200-300 వరకు విక్రయిస్తున్నారు.

చింతచిగురుతో వంటకాలు

చింతచిగురు పప్పు, చింతచిగురు రొయ్యలు, చింతచిగురు చికెన్, చింతచిగుర మెత్తళ్ళు, చింతచిగురుకారం, చింతచిగురుపచ్చడి వంటి పలు రకాల వంటలు తయారు చేస్తుంటారు.

ఆరోగ్య ప్రయోజనాలు ఇలా..

చింతచిగురులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది తినడం వల్ల మలబద్ధక సమస్య తీరిపోతుంది. పైల్స్ నివారణకు ఔషధంగా పనిచేస్తుంది. యాంటీఆక్సిడెంట్‌లు అధికంగా ఉంటాయి. చెడు కొలెస్ట్రాల్ తగ్గించి మంచి కొలెస్ట్రాల్ పెంచుతుంది. గుండె జబ్బుల నివారణకు తోడ్పడుతుంది.

- శరీరంలో ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి అవసరమైన పోషకాలు అందిస్తుంది
- రక్తాన్ని శుద్ధి చేసే మంచి గుణాలు
- జీర్ణశయం సమస్యల నుంచి రక్షిస్తుంది.
- చింతచిగురు ఉడికించిన నీటితో పుక్కిలిస్తే గొంతునొప్పి, మంట, వాపు నివారిస్తాయి.
- నోటికి వచ్చే పూతలను, పగుళ్లను తగ్గిస్తుంది.
- విటమిన్-సీ అధికం.. రోగనిరోధక శక్తి వ్యవస్థను పటిష్ఠం చేస్తుంది.
- చింతచిగురు అధికంగా వాడితే ఎముకలు ధృడంగా పెరుగుతాయి.
- ఆర్థరైటిస్ సమస్యతో బాధపడుతున్న వారికి ఉపయోగపడుతుంది.
- శరీరంలోని వ్యర్థాలు బయటకు పంపే గుణాలు ఉన్నాయి.
- థైరాయిడ్ రోగులు చింతచిగురు ఆహారంలో ఉపయోగిస్తే మంచి ఫలితం
- డయాబెటిస్ ఉన్నవారు చింతచిగురు వినియోగిస్తే రక్తంలోని చక్కెరస్థాయిని తగ్గిస్తుంది.
- నేత్ర సంబంధ సమస్యలనుంచి ఉపశమనం కలుగుతుంది.
- నులిపురుగుల సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు చింతచిగురు వంటకాలతో మంచి ఫలితాలు లభిస్తాయి.

నిర్వాసితులకు ఎన్నాళ్లీ బాధలు

» ప్రభుత్వాలు మారుతున్నా నిర్వాసితులను పట్టించుకోరా ?

» రూ.10 లక్షలు పరిహారం ఇస్తామని మోసగించారు

» రైతు సంఘం రాష్ట్ర నాయకులు



కివ్వాక నిర్వాసితులతో మాట్లాడుతున్న రైతు, కౌలు రైతు సంఘం నాయకులు

కుక్కునూరు, జూలై 4 : 'ప్రభుత్వాలు మారుతున్నాయి.. పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితుల సమస్యలు మాత్రం తీరడం లేదు' అని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం నిర్వాసితుల సమస్యలపై కుక్కునూరు మండలంలోని మర్రిపాడు, కివ్వాక పునరావాస కాలనీలను రాష్ట్ర రైతు సంఘం, కౌలు రైతు సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో సందర్శించి నిర్వాసితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా మండలం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకుని నిర్వాసితులకు భూపరిహారం, పునరావాస పరిహారం అందించాలన్నారు. 2022 గోదావరి వరదలు సంబవించినప్పుడు ప్రభుత్వ అంచనా మొత్తం తప్పిందన్నారు. ప్రభుత్వాలు సర్వేల పేరుతో కాలయాపన చేస్తూ నిర్వాసితులకు పరిహారం చెల్లించడం లేదన్నారు. పద్దెనిమిదేళ్లు నిండిన యువతి, యువకులను పునరావాస జాబితాలో చేర్చలేదని, గత ప్రభుత్వం రూ.10లక్షలు పరిహారం ఇస్తామని చెప్పి కనీసం నిర్వాసితుల ముఖం చూడలేదన్నారు. గతంలో ఇచ్చిన భూములకు మూడున్నర లక్షలు రూపాయలు అదనంగా ఇస్తానని చెప్పి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. నిర్వాసితుల సమస్యలపై ఈనెల పదో తేదీన కేంద్ర మంత్రులను ఢిల్లీలో కలిసి సమస్యలు వివరిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రవి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు రాణి, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, నరసింహారావు, నాగేంద్రరావు, సాయికిరణ్, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రూ.35 లక్షలు పోయినా.. కేసు లేదు ?



నేటికీ వీడని బ్యాగ్ చోరీ మిస్టరీ..

» దొంగతనం చేసింది అంతర్ రాష్ట్ర ముఠానా.. స్థానికులా ?

» గతంలో ఇలాంటి చోరీలు ఎన్నో..

» ఇంకా కేసు పెట్టని వ్యాపారులు

నరసాపురం, జూలై 4: గతంలో నరసాపురం బులియన్ వ్యాపారికి చెందిన ఒక ఉద్యోగి నగదు పట్టుకుని వెళ్తుండగా భీమవరం బస్టాండ్‌లో బ్యాగ్ చోరీకి గురైంది. ఈ దొంగతనంలో చిక్కుముడి ఇప్పటికి సస్పెన్స్‌గానే మిగిలింది. ఐదేళ్ళ క్రితం నెల్లూరుకు చెందిన వ్యాపారి నరసాపురంలో ఆభరణాల ఆర్డర్, నగదు వసూలు చేసుకుని వెళ్తుండగా.. పెనుగొండ వద్ద సూట్‌కేస్ కొట్టేశారు. అప్పుడు కూడా భారీ మొత్తంలో నగదు, బంగారం పోయింది. విచారణలో మహారాష్ట్ర ముఠా అస్త్రం వెలుగుచూసింది. ఇలా భీమవరంలో కూడా బులియన్ వ్యాపారులకు సంబంధించి అనేక చోరీలు జరిగాయి. కొన్ని కేసుల్లో మిస్టరీ వీడితే.. మరికొన్నింటిల్లో ఇంకా ఆచూకీ కూడా చిక్కలేదు. తాజాగా మూడు రోజుల క్రితం నరసాపురం బస్టాండ్‌లో బ్యాగ్ చోరీలో కూడా ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పక్కా ప్లాన్‌గా ఈ చోరీ చేసి ఉండవచ్చన్న వాదనలు వినిపిస్తున్నాయి. గుంటూరు నుంచి ఉద్యోగిని వెంబడించి చోరీ చేశారా.. లేక నరసాపురం మార్కెట్‌లో ఎవరైనా వెంబడించారా అనేది సస్పెన్స్‌గా మారింది. మరోవైపు ఈవిధంగా కనురెప్పపాటులో చోరీలు చేసే నైపుణ్యం అంతర్‌రాష్ట్ర ముఠాలకే ఉంటుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా ఈ కేసులో ఇంతవరకు చిన్న క్లూ కూడా చిక్కలేదు. ఈ చోరీ పెద్ద మిస్టరీగా మారింది. మరోవైపు దీనిపై వ్యాపారులు ఇంతవరకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. పోయింది లక్ష రెండు లక్షలు కాదు.. ఏకంగా రూ.35 లక్షలుపైనే. ఇంతపెద్ద మొత్తంలో సొమ్ము పోతే ఇంతవరకు ఎందుకు కేసు నమోదు చేయలేదన్న దానిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉభయ గోదావరి జిల్లాల్లో బంగారానికి నరసాపురం మార్కెట్ పెట్టింది పేరు. దూరప్రాంతాల నుంచి అనేక మంది ఇక్కడికి బంగారం కొనేందుకు బస్సుల్లో వస్తుంటారు. గతంలో ప్రయాణికుల వద్ద ఇలా బంగారం కొట్టేసిన సంఘటనలు లేవు. ఒక్క వ్యాపారులకు సంబంధించిన గుమస్తాల సొమ్ము చోరీకి గురవుతుంది. ప్రస్తుతం జరిగిన దొంగతనాన్ని తేలిగ్గా తీసుకుంటే రానున్న రోజుల్లో మరిన్ని జరిగే అవకాశం ఉంది. ఈ కేసులో మిస్టరీని చేధిస్తే గాని దీనివెనుక ఉన్నది రాష్ట్ర దొంగలా.. అంతర్‌రాష్ట్ర ముఠా అనేది తేలనుంది. అయితే వ్యాపారులు కేసు పెడితేనే ఈ చోరీలో చిక్కుముడి వీడుతుంది. లేకపోతే ఇది పాత కేసులా మిస్టరీగానే మిగులుతుందన్న వాదనలు వ్యక్తమవుతున్నాయి.

ఆగిన బస్సును ఢీకొని వంటమేస్త్రి దుర్మరణం



ప్రమాద స్థలం వద్ద బస్సు, బైక్.. (ఇన్‌సెట్‌లో) మృతదేహం

పెదపాడు, జూలై 4: పెదపాడు మండలం కలపర్రు వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. పెదపాడు మండలం పాతముప్పర్రుకు చెందిన బుల్లంకి ఉమామహేశ్వరరావు (25) కలపర్రు హైవేపై వున్న హోటల్‌లో వంటమేస్త్రిగా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం విధులు ముగించుకుని బుల్లెట్‌పై వెళ్తూ కలపర్రు సాయిబాబా గుడి సమీపంలో బీహెచ్‌ఎల్ నుంచి ఏలూరు వెళుతున్న ఆగి వున్న బస్సును వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రగాయాలైన అతడు మృతి చెందాడు. మృతుడికి వివాహం కాలేదు. సమాచారం అందుకు న్న పెదపాడు పోలీసులు వివరాలు సేకరించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి తులసీదాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పెదపాడు ఎస్‌ఐ కె.శుభశేఖర్ తెలిపారు.

దుక్కిదున్నుతూ ట్రాక్టర్ నుంచి పడి ఒకరి మృతి



రాంబాబు (ఫైల్)

జంగారెడ్డిగూడెం, జూలై 4 : పొలంలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి జారిపడి మృతి చెందిన ఘటన జంగారెడ్డిగూడెం మండలం తాడువాయిలో జరిగింది. గురువారం తాడువా యి గ్రామంలో పొలంలో కలపాల రాంబాబు (33) ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి జారి ట్రాక్టర్ కింద పడి మృతిచెందాడు. స్థానికులు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు రాంబాబుకు తాడువాయి శివారులో రెండెకరాల వ్యవసాయభూమి ఉందని, కొద్ది రోజుల కిందట ట్రాక్టర్ కొనుగోలు చేసినట్టు బంధువులు తెలిపారు. అతడు గ్రామంలో అందరినీ మంచిగా పలకరిస్తాడని చిన్నవయసులోనే మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడుకి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. తండ్రి జయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ జ్యోతిబసు తెలిపారు.

గునపంతో దాడి చేసిన వ్యక్తిపై కేసు

కొయ్యలగూడెం, జూలై 4: పాత గొడవల కారణంగా ఓ వ్యక్తిపై మరొకరు గునపంతో దాడి చేసిన ఘటన కొయ్యలగూడెం మండలం సరిపల్లిలో జరిగింది. ఎస్‌ఐ విష్ణువర్ధన్ తెలిపిన వివరాలివి.. గురువారం పాత గొడవల కారణంగా వెంకటేశ్వరరావు అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన తాడేపల్లి సాయి అనే వ్యక్తి గుణపంతో దాడి చేశాడు. ఈ ఘటనలో వెంకటేశ్వరరావు తలకు గాయమైంది. గతంలో వీరిద్దరికి వివాదం జరగడంతో కేసు నమోదు చేశామని మళ్లీ ఈ ఘటన చోటు చేసుకుందని పోలీసులు తెలిపారు. ఇద్దరికి పక్కపక్కనే పొగాకు బ్యారన్‌లు ఉండడం, ఒకే దారి ఉండడం వల్ల గొడవలు జరుగుతున్నాయని ఎస్‌ఐ తెలిపారు.

శ్రీవారి హుండీ నుంచి నగదు తస్కరణ

» పట్టుకుని పోలీసులకు అప్పగించిన దేవస్థానం సెక్యూరిటీ

ద్వారకాతిరుమల, జూలై 4: చినవెంకన్న ఆలయ ప్రాంగణంలోని ఓ హుండీలో చేయిపెట్టి నగదును తస్కరించిన వ్యక్తిని ఆలయ మహిళా సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. అనంతరం అతడి నుంచి నగదును స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఎస్‌ఐ జి.సతీష్ తెలిపిన వివరాలివి.. చింతలపూడిలోని ఆంథోనినగర్‌కు చెందిన దుడ్డి పవన్‌కుమార్ గురువారం ఉదయం క్షేత్రానికి వచ్చి 11.30 గంటల సమయంలో అనివేటి మండపం వద్దనున్న హుండీలో చేయిపెట్టాడు. దీన్ని చూసిన దేవాలయ సెక్యూరిటీ సిబ్బంది అల్లాడ ధర్మావతి అతడిని పట్టుకుని, అతడి వద్ద వున్న రూ.500 నగదును స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు, ఇప్పటికే అతడిపై పది కేసులు వరకు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. సెక్యూరిటీ ధర్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు



తీవ్ర గాయాలైన మనుమడు, మామ్మ

కొయ్యలగూడెం, జూలై 4: మోటార్ సైకిల్‌ని లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన బయ్యన్నగూడెం గ్రామం వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలివి.. గురువారం సాయంత్రం కొయ్యలగూడెం నుంచి అశ్వారావుపేటకు మామ్మ, మనుమడు వెళ్తున్న మోటారుసైకిల్‌ను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. వారిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బైక్ నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. తల, కాలు, చెయ్యికి తీవ్ర గాయాలు కావడంతో రక్తస్రావం జరిగింది. బైక్‌పై ఉన్న వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గేదె అడ్డొచ్చి.. మోటారు సైక్లిస్టుకు గాయాలు

కైకలూరు, జూలై 4: రహదారి ప్రమాదంలో గాయపడిన యువకుడిని ఎస్‌ఐ సమయస్ఫూర్తితో ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యసేవలను అందించారు. గురువారం మండవల్లికి చెందిన తెంటు హేమంత్ అనే యువకుడు కైకలూరు మండలం ఆటపాకలో ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. ఆ సమయంలో గేదె అడ్డురావడంతో ఢీకొనగా గాయాలయ్యాయి. ఆ సమయంలో అటుగా వెళుతున్న కైకలూరు రూరల్ ఎస్‌ఐ టి.రామకృష్ణ యువకుడిని తన జీపులో కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. బాధిత కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు.

ఖత్తర్‌లో గుమ్ములూరు వాసి మృతి

» అగ్నిప్రమాదంలో కుమారుడుకి గాయాలు



షేక్ బాషా (ఫైల్)

పోడూరు, జూలై 4 : ఖత్తర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో తండ్రి మృతిచెందగా కుమారుడు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాలివి.. పోడూరు మండలం గుమ్ములూరు గ్రామంలో కోమటి చెర్వు ప్రాంతానికి చెందిన షేక్ బాషా(46), ఉపాధి నిమిత్తం మూడేళ్ల క్రితం ఖత్తర్ వెళ్లి టైల్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఏడాది కిందట స్వదేశానికి వచ్చి తిరిగి ఖత్తర్ వెళ్తూ తన కుమారుడు షేక్ వల్లీని అక్కడ డ్రైవింగ్ పని నిమిత్తం కూడా తీసుకుని వెళ్లాడు. వారిద్దరూ కలిసి ఒక రూమ్‌లో ఉంటున్నారు. రోజూ తండ్రి టైల్స్ కంపెనీలో పనిచేస్తూ, కుమారుడు డ్రైవింగ్ పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు. బుధవారం సాయంత్రం వీరు ఉండే ఇంటిగదిలో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తండ్రి బాషా పూర్తిగా కాలిపోయి మృతి చెందాడు. కుమారుడు వల్లీ తీవ్రగాయాలతో బయటపడ్డాడు. ప్రమాద ఘటనపై బుధవారం రాత్రి ఇక్కడ కుటుంబ సభ్యులకు సమాచారం వచ్చింది. ప్రమాదం ఏవిధంగా జరిగిందో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. బాషా మృతిచెందడంతో ఆధారం కోల్పోయిన వారి కుటుంబం కన్నీరుమున్నీరైంది. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య మీరాబీబీ, కుమారుడు వల్లీ, కుమార్తె తనూజ భేగం ఉన్నారు. వల్లీ ఖత్తర్‌లో ఉంటుండగా కుమార్తె తనూజ భేగంకు వివాహం జరిగి అత్తవారి ఇంటివద్ద ఉంటుంది.



అమృతహస్తం, రాజుగారి గోచీ నాటికల్లో సన్నివేశాలు

'ప్రజల హృదయాల్లో నాటికలకు సుస్థిరస్థానం'

» అలరించిన రాష్ట్రస్థాయి నాటిక పోటీలు

ఏలూరు రూరల్, జూలై 4 : ప్రజల హృదయాల్లో నాటికలు సుస్థిర స్థానం అని హేలాపురి కళాపరిషత్ అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ అన్నారు. వైఎంహెచ్‌ఏ హేలాపురి కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఏలూరు వైఎంహెచ్‌ఏ ప్రాంగణంలో అల్లూరి సీతారామరాజు స్మారక రాష్ట్ర స్థాయి నాటిక పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈనెల 7వ తేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు. నాటకం కలకలం ఉంటుందని, ఎంతో మంది కళాకారులు నాటకంతో ప్రజల హృదయాల్లో కలకాలం గుర్తుంటాయన్నారు.

'అమృతహస్తం' నాటిక..

అమరావతి ఆర్ట్స్ బృందం ప్రదర్శించిన 'అమృతహస్తం' ఆలోచింప చేసింది. ఒక తల్లికడుపున పుట్టిన అన్నాచెల్లెళ్ల ప్రేమ, అనురాగం, ఆధునిక సమాజంలో మృగ్యమైపోతున్న తరుణంలో ఆ బంధాల గొప్పతనం నేటి సమాజానికి అవి ఎంతో అవసరమని తెలిపేలా నాటిక చాటిచెప్పింది. ప్రేమపెళ్లి చేసుకుని, భర్త దాష్టీకానికి గురవుతున్న పిల్లలను భర్తతో సహా ఆదరించిన అన్న ఆడపడుచు భర్త దురాశను ఆధునిక టెక్నాలజీతో చట్టం ముందు నిలబెట్టిన అతని భార్య తెలివితేటలు ఇలా ప్రతి సన్నివేశం ప్రేక్షకుల మనస్సులను దోచుకుంది. రచన కె.సత్యనారాయణ, దర్శకత్వం వై.హరిబాబు వహించారు.

'రాజుగారి గోచీ' నాటిక..

కళానికేతన్, వీరన్నపాలెం బృందం వారిచే 'రాజుగారి గోచీ' నాటిక ఆకట్టుకుంది. రాజుని, పాలనను ఎలాగైనా దారిలో పెట్టాలని చూసే మాజీ మంత్రి నేర విచారణ, నేరస్తుడి శిక్షణ కంటే కూడా నేరం వల్ల అనాథలైన బాధితులను ఆదుకోవడం ముఖ్యమని చెప్పడమే 'రాజుగారి గోచీ' నాటిక ప్రేక్షకులను అలరించింది. ఓ చిన్న దీవిలో ఆరువేల జనాభా. ముక్కుపిండి పన్నులు వసూలుచేసే పాలకులు, పేదల శ్రమను దోచుకునేందుకు జూదశాలను ఏర్పాటు చేస్తారు. దానివల్ల ఓ హత్య జరుగుతుంది. హంతకుడికి రాజు ఉరిశిక్ష వేస్తాడు. ఉరిశిక్ష అమలు చేయలేక దాన్ని జైలుశిక్షగా మారుస్తాడు. ఖైదీకి భోజనం, కాపలా, ఆర్థిక వ్యవస్థకు భారమవుతుంది. కూర్చొని తినడానికి అలవాటు పడ్డ హంతకుడు వెళ్ళిపొమ్మనా వెళ్ళడు. చివరకు ఖైదీ కోర్కెలు తీర్చి బుజ్జగించి దేశం దాటించి వేస్తారు. చివరిగా నేరవిచారణ, నేరస్తుడికి శిక్ష కంటే బాధితులను ఆదుకోవడం ముఖ్యమని చెప్పడమే 'రాజుగారి గోచీ' నాటిక విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో వైఎంహెచ్‌ఏ మేనేజ్మెంట్ అధ్యక్షుడు వై.సోమలింగేశ్వరరావు, కేబీవీ రమేష్, గౌరవ అధ్యక్షుడు గుత్తా కౌసల్యాంద్రరావు, ఎస్కే ఖాజావలీ, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నారుమడులు ముంపున ఉన్నాయా ?

» పశ్చిమ గోదావరి జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు



సిబ్బందితో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

పాలకొల్లు రూరల్, జూలై 4 : మండలంలో ముంపునకు గురైన నారుమడులు ఏమైనా ఉన్నాయా ? అని జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్ వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. గురువారం లంకలకోడేరు రైతు సేవా కేంద్రాన్ని గురువారం ఆయనఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో వచ్చే వర్షాలకు పంటలు నష్టపోకుండా రైతులకు అధికారులు తగిన సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. నారుమడులు ఏదశలో ఉన్నాయి. నాట్లు ఎప్పటికి పూర్తి అవుతాయని అధికారులను అడిగి తెలుసుకుని, రికార్డులు పరిశీలించారు. పీఎం కిసాన్ పథకంపై ఆరాతీసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏడీఏ అడ్డాల పార్వతి, ఏవో ఎం.శామ్యూల్ జాన్సన్, జిల్లా సాంకేతిక వ్యవసాయ శాఖ అధికారి బీఆర్ ప్రియదర్శిని, ఏఈవో కె.ప్రవీణ్, వీఏఏ డి. నరేంద్రకుమార్, భరత్ తదితరులు ఉన్నారు.

మోకాళ్లతో శ్రీవారి మెట్లెక్కిన పవన్ వీరాభిమాని



ఆలయ మెట్లను మోకాళ్లతో ఎక్కుతున్న పవన్ అభిమాని సూర్య

ద్వారకాతిరుమల, జూలై 4: చేతిపై పవన్‌కల్యాణ్ పచ్చబొట్టు.. పవన్ గెలిచి అసెంబ్లీలోకి అడుగుపెట్టేలా చూడు స్వామీ.. అంటూ చిన వెంకన్నకు ఓ పవన్ వీరాభిమాని మొక్కుకున్నాడు. ఇటీవల కూటమి గెలుపుతో ఆ యువకుడు గురువారం చిన వెంకన్న ఆలయ ప్రధాన రాజగోపురం మెట్ల మార్గాన మోకాళ్లపై మెట్లు ఎక్కి మొక్కును తీర్చుకున్నాడు. పశ్చిమగోదావరి జిల్లా అత్తిలికి చెందిన సూర్య, దుర్గానరసింహారావు ఉదయం శ్రీవారి ఆలయానికి చేరుకుని మొక్కు అనంతరం స్వామిని దర్శించుకున్నారు. సూర్య మాట్లాడుతూ తాము ఆశించిన దానికంటే పవన్‌కు ఆ భగవంతుడు ఎక్కువే ఇచ్చారని.. కూటమి ప్రభుత్వం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉండేలా పాలన ఉంటుందని చెప్పారు.

డీటీసీ డీఎస్పీ బదిలీ ఉత్తర్వులు జారీ



ప్రభాకరరావు

ఏలూరు క్రైం, జూలై 4 : ఏలూరు జిల్లా పెదవేగిలో ఉన్న డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ సెంటర్‌లో డీఎస్పీగా పనిచేస్తున్న కింజారపు ప్రభాకరరావును బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖపట్టణం సిటీ స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా ఆయనను బదిలీ చేశారు. కొన్నేళ్ళుగా పెదవేగి డీటీసీ డీఎస్పీగా ఆయన విధులను నిర్వ ర్తిస్తున్నారు. వచ్చే నెలలో ఆయన ఉద్యోగ విరమణ చేయనున్నారు.

పోలీసులకు చిక్కిన సైబర్ నేరస్థుడు



పి.తేజ్‌కుమార్

ముసునూరు, జూలై 4: సైబర్ నేరాల్లో ఆరితేరిన యువకుడిని గురువారం ముసునూరు పోలీసులు పటుకుని, సైబర్ పోలీసులకు అప్పగించారు. ఎస్‌ఐ పి.వాసు తెలిపిన వివరాలివి.. ఈనెల రెండున రమణక్కపేటలో పేకాట శిబిరంపై దాడి చేయగా చాట్రాయి మండలం చిత్తపూరుకు చెందిన పొన్నగంటి తేజ్‌కుమార్ పట్టుపడగా కేసు నమోదు చేశామన్నారు. సోషల్ మీడియా ద్వారా సమాచారం అందుకున్న వరంగల్ సైబర్ పోలీసులు తేజ్‌కుమార్ చేసిన సైబర్ నేరాలు, అతడిపై నమోదైన కేసుల సమాచారం అందించారని ఎస్‌ఐ తెలిపారు. నిందితుడిని చాట్రాయిలో అదుపులోకి తీసుకుని సైబర్ పోలీసులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మార్టేరులో మావుళ్ళమ్మ జాతర



పెనుమంట్ర, జూలై 4 : మార్టేరు గ్రామం దేవాంగులపేటలో మావుళ్ళమ్మ జాతర ప్రారంభమైంది. శ్రీ గౌరీ శంకర్ దేవాంగ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం మాన్యం రవికుమార్ రాజేశ్వరి దంపతులచే గణపతి పూజ చేశారు. అనంతరం శ్రీ వీరభద్ర స్వామి సంబరం మార్టేరు పురవీధులలో అత్యంత వైభవంగా నిర్వహించారు. 108 మంది కళాకారులతో జాతర మహోత్సవం నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రభల ఉత్సవంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొంటారని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాల స్వీకరించాలని వారు కోరారు.

వసతి గృహాల నిర్వహణ మెరుగ్గా ఉండాలి: కలెక్టర్

భీమవరం టౌన్, జూలై 4 : ప్రభుత్వ సంక్షేమవసతి గృహాల నిర్వహణ మెరుగ్గా ఉండాలని జిల్లా కలెక్టరు సి.నాగరాణి గురువారం సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులతో సమావేశమై జిల్లాలోని వసతి గృహాల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో శాఖల వారీగా ఎన్ని సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి, ఎంతమంది విద్యార్థులు ఉన్నారు, వసతి గృహాల స్థితిగతులు, తదితర అంశాలపై ఆరా తీశారు. సంక్షేమ వసతి గృహాలు మెరుగైన రీతిలో నిర్వహణ ఉండాలని, లోపాలు ఉంటే ఉపేక్షించేది లేదన్నారు. కొన్ని వసతి గృహాల్లో డ్రెయినేజీలు, వాడకం నీరు అవసరం ఉందని అధికారులు జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకువచ్చారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బొమ్మిడి, పొత్తూరి

నరసాపురం, జూలై 4: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే నాయకర్ పిలుపునిచ్చారు. గురువారం మునిసిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీని ఎమ్మెల్యే నాయకర్, చైర్‌పర్సన్ వెంకటరమణ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నాయకర్ మాట్లాడుతూ వర్షాకాలంలో డయేరియా, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ఎక్కువగా వస్తాయన్నారు. కావున ప్రజలు కాచిచల్లార్చిన నీరు తాగి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

టీడీఎస్‌పై విద్యార్థులకు అవగాహన

నరసాపురం రూరల్, జూలై 4: మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఆదాయ పన్ను శాఖకు సంబంధించిన టీడీఎస్ పన్ను మినహాయింపుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏలూరు, పాలకొల్లు ఆదాయ పన్నుశాఖ అధికారులు శ్రీనివాసరావు, రామచంద్ర మూర్తి ముఖ్య అతిథులుగా విచ్చేసి టీడీఎస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాపారులు, కాంట్రాక్టర్లు, ఆదాయ పన్ను చెల్లించే అధికారులు, ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీలు ఆదాయపన్ను చెల్లింపులో టీడీఎస్ మినహాయింపుపై అవగాహన కల్పించారు. అనంతరం వారిని సత్కరించారు. ఈకార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె.సత్యనారాయణ, కోశాధికారి స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

ఉండి, జూలై 4 : గిరిజనులలో చైతన్యం తీసుకొచ్చిన వీరుడు అల్లూరి అని మండల టీడీపీ ఉపాధ్యక్షుడు పేరిచర్ల బాలరాజు అన్నారు. చెక్ పోస్టు రాజు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు పేరిచర్ల మురళీ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు విద్యాసామగ్రిని అందించారు.

రక్తదానం



ఉండి, జూలై 4: విప్లవవీరుడు అల్లూరి, వంగవీటి రంగా జయంతి సందర్భంగా కూటమి నాయకులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉండి నియోజకవర్గ జనసేన అధ్యక్షుడు జుత్తుగ నాగరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కందుల బలరాం, మాజీ సర్పంచ్ రెడ్డిపల్లి సత్యనారాయణ, జనసేన సుబ్బరాజు పాల్గొన్నారు.

ఈవో శ్రీనివాసరావుకు అభినందనలు

పాలకొల్లు అర్బన్, జూలై 4 : క్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానం (పెద్దగోపురం) కార్యనిర్వాహణాధికారిగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన ముచ్చర్ల శ్రీనివాసరావును గురువారం ఆలయ కళ్యాణ మండపంలో శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామి సేవా సమితి కార్యవర్గ సభ్యులు కలిసి శాలువా కప్పి, స్వామివారి చిత్రపటాన్ని అందించి అభినందించారు. ఆలయంలో జరిగే కార్యక్రమాలు అన్నింటికి తమ సేవా సమితి పూర్తిగా సహకారం అందజేస్తామని సమితి అధ్యక్షుడు శీరం ఆనంద కృష్ణ తెలిపారు. ఈకార్యక్రమంలో ధనాని సూర్యప్రకాష్, కొప్పుల శ్రీనివాసరావు, ధనాని శ్రీరామమూర్తి,గోపరాజు గోపి, ఎస్ బాబి, వి అంజిబాబు పాల్గొన్నారు.

7న గురు పూజోత్సవం

పాలకొల్లు అర్బన్, జూలై 4 : స్థానిక సరస్వతి శిశుమందిరం హైస్కూల్లో ఈనెల 7వ తేదీ ఉదయం 10గంటలకు ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహిస్తున్నట్టు ఖండ కార్యవాహ బి.సత్యజిత్ కుమార్, ఖండ సహకార్యవాహ డాక్టర్ సిహెచ్ హేమంత్ మాధుర్ తెలిపారు.

ఉపాధి పనుల నిలిపివేతపై వాగ్వివాదం



యలమంచిలి, జూలై 4: లక్ష్మీపాలెం లో కొన్నిరోజులుగా ఉపాధిహామీ పథకం పనులను ఎందుకు నిలిపివేశారో చెప్పాలని ఉపాధిహామీ పథకం మహిళా కూలీలు పంచాయతీ పాలకమండలి, అధికారులను ప్రశ్నించారు. లక్ష్మీపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ గటిగం టి మహేష్ అధ్యక్షతన గురువారం పంచాయతీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ పథకం మహిళా కూలీలు మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేస్తున్నారని.. ఎవరి ఆదేశాల మేరకు పనులు నిలిపివేశారో చెప్పాలని సర్పంచ్, అధికారులను నిలదీశారు. అనంతరం నీటి సంఘం మాజీ అధ్యక్షుడు ఆరుమిల్లి చిన్ని మాట్లాడుతూ అసైన్డ్‌ల్యాండ్ అన్యాక్రాంతం అయ్యిందని అన్నారు. ఈ నేపథ్యంలో సర్పంచ్, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం జరిగింది. త్వరలోనే ఉపాధిహామీ పనులను చేపట్టేలా తగిన చర్యలు చేపడతామని సర్పంచ్ హామీ ఇవ్వడంతో వాగ్వాదం సద్దుమణిగింది.

నిశాంత్ వర్మకు ఎక్సలెన్సీ అవార్డు

పాలకోడేరు, జూలై 4: ఎస్ఆర్‌కెఆర్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మకు అల్లూరి సీతారామరాజు ఎక్సలెన్సీ అవార్డును ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు అందించారు. మోగల్లులో అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని పురస్కరించుకుని ఈ అవార్డును అందించటం ఆనందంగా ఉందన్నారు.

ఉండి అభివృద్ధికి రూ.50 వేల విరాళం

పాలకోడేరు, జూలై 4: ఉండి నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేస్తున్న ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుకు మోగల్లు గ్రామానికి చెందిన పెనుమత్స వెంకట సుబ్రహ్మణ్యరాజు రూ.50వేల చెక్కును గురువారం ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యరాజును ఎమ్మెల్యే అభినందించారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాల ఏర్పాటు

భీమవరం టౌన్, జూలై 4: ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, చిరంజీవి యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉండపల్లి రమేష్ నాయుడు తెలిపారు. 23వ వార్డులోని సచివాలయంలో జనసేన నాయకులు రాట్నాల శ్రీనివాస్ రావు సహకారంతో సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే రామాంజనేయులు చిత్రపటాలను అందజేశారు.







నరసాపురంలో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసిన బీజేపీ నాయకులు.. భీమవరంలో కంతేటి వెంకట్రాజు ఆధ్వర్యంలో.. ఉండిలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో.. పాలకొల్లులో క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసిన దృశ్యం





భీమవరంలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న చలసాని, కమ్యూనిస్టు నాయకులు

అల్లూరి విగ్రహాన్ని పార్లమెంట్‌లో పెట్టాలి

ఘనంగా సీతారామరాజు జయంతి వేడుకలు

భీమవరం అర్బన్, జూలై 4: మన్యం వీరుడు అల్లూరి విగ్రహాన్ని పార్లమెంటులో పెట్టాలని సీపీఎం రాష్ట్రకార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుల మంతెన సీతారాం డిమాండ్ చేశారు. భీమవరంలోని అల్లూరి స్మృతి వనం వద్ద సభ జరిగింది. ముందుగా తణుకు, తాడేపల్లిగూడెం, ఆచంట, పెనుమంట్ర, పెనుగొండ అత్తిలి, పోడూరు మండల ప్రాంతాల నుంచి బైక్ ర్యాలీగా మోగల్లు చేరుకుని అల్లూరి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా భీమవరం అల్లూరి స్మృతి వనం వద్దకు చేరుకున్నారు. ప్రత్యేకహోదా సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ అల్లూరి జీవితం విద్యార్థులకు ఆదర్శనీయం అని అన్నారు. అల్లూరి సీతారామరాజు సేవా సమితి ఆధ్వర్యంలో ఏఎస్ఆర్ సాంస్కృతిక కేంద్రంలో అల్లూరి విగ్రహానికి, ప్రకాశం చౌక్ సెంటర్‌లోని అల్లూరి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఏఎస్ఆర్ సేవా సమితి అధ్యక్షలు గాదిరాజు సుబ్బరాజు, సభ్యులు సుబ్రహ్మణ్యంరాజు, రామ కృష్ణంరాజు పాల్గొన్నారు. కాంగ్రెస్ ఇన్‌చార్జి అంకెం సీతారాం, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సీతారాం ప్రసాదు, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు వేల్పుల నాగేశ్వరరావు నివాళులు అర్పించారు. మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో తాడేరు రోడ్డులోని ఇందిరమ్మ కాలనీలోని నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. కలిదిండి మురళీ కృష్ణంరాజు, శుభ, కేవీఎస్ఎన్ రాజు, బాబు, గ్రంధి కుమార్, అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

భీమవరం రూరల్: వెంప గ్రామంలో కలిదిండి రామ చంద్రరాజు నివాసం వద్ద క్షత్రియ యూత్ ఆధ్వర్యంలో వంద మంది దివ్యాంగులు, వృద్ధులకు 2వేలు రూపాయలు చొప్పున ఆర్థిక సహకారం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, ఉపాధ్యాయులు పెన్మెత్స నరేంద్రవర్మ, భూపతిరాజు సుబ్బరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ళ నాగేశ్వరరావు, కలిదిండి కాశీ విశ్వనాథ రాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

భీమవరం టౌన్: నరసయ్య అగ్రహారంలోని అల్లూరి విగ్రహం వద్ద జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు యువజన సంఘాల జిల్లా అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి, గంటా త్రిమూర్తులు, పత్సమట్ల సూర్యనారాయణ రాజు, కే ప్రదీప్, విన్నకోట వినాయక్ పాల్గొన్నారు. ప్రకాశం చౌక్‌లో రామకృష్ణ మిషన్ స్థాపకుడు స్వామి వివేకానంద, భారతదేశ జాతీయ పతాక నిర్మాత పింగళి వెంకయ్య వర్ధంతి, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వారి విగ్రహాలకు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళిలర్పించారు.

అరసవల్లి సుబ్రహ్మణ్యం, వానపల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. ఏఎస్ఆర్ నగర్‌లోని అల్లూరి సీతారామ రాజు విగ్రహానికి లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ పేరిచర్ల యేసు మూర్తి రాజు, నడింపల్లి మహేష్ కుమార్ వర్మ, నరహరశెట్టి కృష్ణ, సెక్రెటరీ గోపిశెట్టి మురళి కృష్ణారావు, బొండాడ కుమార వెంకటరత్నం పూలమాలలు వేశారు. బిజెపి కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, కోమటి రవికుమార్, కాగిత సురేంద్ర, కురెళ్ళ నరసింహారావు ,షేక్ మొహిదీన్ తదితరులు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పాలకొల్లు అర్బన్: ఎల్ఆర్ పేటలోని క్షత్రియ సంక్షేమ పరిషత్ కల్యాణ మండపం వద్ద గల అల్లూరి విగ్రహానికి పరిషత్ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. రక్తదాన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. కలిదిండి సూర్యనారాయణ, కేవీ రామకృష్ణంరాజు, కలిదిండి రామరాజు, కేవీ కృష్ణవర్మ, డాక్టర్ కెఎస్‌పిఎన్ వర్మ, కె రామకృష్ణంరాజు, కలిదిండి వెంకటపతి వర్మ పాల్గొన్నారు. పట్టణంలోని ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో అల్లూరి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. శాఖా గ్రంథాలయంలో లైబ్రరీ అధికారిణి వి.శాంతకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అల్లూరి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విశ్రాంత ఉపాధ్యాయులు కేవీవీ సత్యనారాయణ, గోపాలస్వామి, దుర్గ, పూజిత, నందిని, రాజేష్ పాల్గొన్నారు. వీవర్స్ కాలనీలోని మున్సిపల్ ఎలిమెంట్రీ పాఠశాలలో హెచ్ఎం ఆర్ భవానీ ప్రసాద్ అధ్యక్షతన అల్లూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

యలమంచిలి: నార్నిమెరక గ్రామం ప్రధానకూడలి వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి యూటిఎఫ్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.విజయరామరాజు, పోలిశెట్టి క్రాంతికుమార్, బి.గోపిమూర్తి, బాలాజీ పాల్గొన్నారు.

ఆచంట: ప్రజా సంఘాల కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీఎన్ వర్మ, సిర్రా నరసింహమూర్తి, పి. మోహనరావు, కొండేటి రామవులు, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

పెనుగొండ: పెనుగొండలో అల్లూరి చిత్రపటానికి సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. నక్కా వేద వ్యాస శాస్త్రి, కటికిరెడ్డి నానాజీ, వేండ్ర రాము, మద్దింశెట్టి వెంకటేష్, రొక్కాల సురేష్ పాల్గొన్నారు.

నరసాపురం రూరల్: మునిసిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే నాయకర్, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, చైర్‌పర్సన్ వెంకటరమణ, ఇన్‌చార్జి కమిషనర్ రమేష్ తదితరులు అల్లూరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి అగ్నికులక్షత్రీయ రాష్ట్ర సాధికార కన్వీనర్ కొప్పాడ రవి, కొల్లు పెద్దిరాజు, మౌలాలీ, సంకుభాస్కర్ పాల్గొన్నారు. సీతారాంపురం, పట్టణంలోని టేలర్ హైస్కూల్‌లో అల్లూరి విగ్రహాలకు బీజేపీ కన్వీనర్ మేకల సతీశ్, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆకివీడు: స్వాతంత్ర్య పోరాటం చేసి చిన్న వయస్సులో ప్రాణాలర్పించిన వీరుడు అల్లూరి సీతారామ రాజు అని టీడీపీ మండల-పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామ వర ప్రసాద్, బొల్లా వెంకట్రావు అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా కాటన్‌పార్కు సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ మండల, పట్టణ కార్యదర్శులు నౌకట్ల రామారావు, గంధం ఉమా, ఎండీ అజ్మల్, బచ్చు కృష్ణ, కిమిడి నాగరాజు, దూబ సురేష్, ఓసూరి పాల్గొన్నారు.

ఉండి: బ్రిటీష్ వారిని గడగడలాడించిన మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు యువతకు స్ఫూర్తిదాయకమని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాగిత బుజ్జి అన్నారు. కార్యక్రమంలో కునుకు శ్రీనివాసరావు, కర్రి శ్రీనివాసరావు, మజ్జి కృష్ణప్రసాదు, పెన్మెత్స గోపాలకృష్ణంరాజు, లంక ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

- అల్లూరి చిత్రం ముద్రించిన నాణెం విడుదల చేయాలని ఉండి లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదరులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు అన్నారు. రచయిత కుమార్ కూనపరాజు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో లయన్స్ సభ్యులు కన్నెగంటి రూత్‌కళ, గాదిరాజు వెంకటేశ్వరరాజు, కలిదిండి సీతారామరాజు, నరసరాజు, పాలతీర్థపు నరసింగరావు, రంగరాజు, గోపాలరాజు, బొండాడ విశ్వేశ్వరగుప్తా పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: అల్లూరి జయంతి సందర్భంగా గురువారం పట్టణంలో క్షత్రియ సేవాసమితి ప్రతినిధి సీహెచ్ఏఆర్‌కే వర్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, మున్సిపల్ ఇంచార్జి కమిషనర్ మురళికృష్ణ పాల్గొన్నారు.

పెంటపాడు : స్థానిక పంచాయతీ వద్ద అల్లూరి చిత్రపటానికి టీడీపీ అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావు, సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి శోభన్‌కుమార్, ఎంపీటీసీ రెడ్డి సూరిబాబు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

గణపవరం: పిప్పరలో టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, మల్లపురాజుపేటలో టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ళ సుబ్బారావు, అర్ధవరంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అద్దేపల్లి వాసురాజు, గణపవరంలో వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు అల్లూరి గంగరాజు, గణపవరంలో కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, కాపారం చిన్న, జనసేన నాయకులు తోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు.









తణుకులో రంగా విగ్రహానికి పూలమాల వేసిన ఎమ్మెల్యే ఆరిమిల్లి.. ఆచంటలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న రంగా అభిమానులు.. భీమవరంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు.. తాడేపల్లిగూడెంలో రంగా విగ్రహానికి పూలమాల వేసిన ఎమ్మెల్యే బొలిశెట్టి, టీడీపీ కన్వీనర్ వలవల

అందరివాడు వంగవీటి రంగా

వాడవాడలా రంగా జయంతి వేడుకలు

నరసాపురం టౌన్, జూలై 4: రంగా ఫ్లెక్సీలతో బైక్ ర్యాలీలు నిర్వహించారు. జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే నాయకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మెయిన్‌రోడ్‌లోని విగ్రహానికి కాపు నాయకులు కోటిపల్లి సురేశ్, తమ్మిశెట్టి బాబ్జీ, ఆడబాల అయ్యప్పనాయుడు పూలమాలలు వేశారు. మండలంలోని చిట్టవరం గ్రామంలో అంజనాపుత్ర, చిరుపవన్ యూత్ ఆధ్వర్యంలో రంగా విగ్రహానికి ఎమ్మెల్యే నాయకర్ పూలమాలలు వేశారు.

తణుకు: పేదలు పిలిస్తే పలికే వ్యక్తిగా వంగవీటి మోహనరంగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం సొసైటీ రోడ్డు, కొమ్మాయి చెర్వుగట్టు వద్ద ఉన్న రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళుర్పించారు. అలాగే వేల్పూరు రోడ్డులోని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా బాలురున్నత పాఠశాల ఆవరణలో ఉన్న వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు.

భీమవరం టౌన్: పట్టణంలో తాలూకా ఆఫీస్ సెంటర్‌లో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు పాల్గొని వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. తహసీల్దార్ కార్యాలయ రోడ్డులోని వంగవీటి మోహన్ రంగ విగ్రహం వద్ద మోహన్ రంగ జయంతి కార్యక్రమాన్ని రాధా రంగ మిత్ర మండలి జిల్లా గౌరవాధ్యక్షుడు ఉండపల్లి రమేష్ నాయుడు, సభ్యులు సిడ్నీ, బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. వంగవీటి మోహన్ రంగ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయిని సత్కరించి పలువురి పేదవారికి భోజనాలు అందించారు.

తాడేపల్లిగూడెం అర్బన్/రూరల్: మాజీ కౌన్సిలర్ రామిశెట్టి సురేష్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, తదితరులు పాల్గొన్నారు. గాంధీబొమ్మ సెంటర్ వద్ద సర్పంచ్ మద్దుకూరి ధనరాజు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు.

ఆకివీడు: వంగవీటి మోహన్ రంగా వ్యక్తి కాదు శక్తి అని టీడీపీ పట్టణ అధ్యక్ష-కార్యదర్శులు బొల్లా వెంకట్రావు, గంధం ఉమా అన్నారు. రంగా జయంతి సందర్భంగా మాదివాడ సెంటర్‌లో టీడీపీ, రాధా-రంగ మిత్ర మండలి ఆధ్వర్యంలో గురువారం రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కులమతాలకు అతీతంగా అందరి వ్యక్తి, మహోన్నత వ్యక్తి వంగవీటి రంగా అన్నారు. పేదలకు అండగా నిలిచిన వ్యక్తి రంగా అన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ జామి హైమావతి, వైస్ చైర్మన్ పుప్పాల పండు, రాధా-రంగ మిత్ర మండలి నిర్వహకులు నిమ్మల నాగు, మోటుపల్లి రాజు, పుప్పాల చిన్న, వినియోగదారు ల సంఘాల సమాఖ్య రాష్ట్ర సహాధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య, డీవీ రమణ మూర్తి పాల్గొన్నారు.

పాలకొల్లు అర్బన్: పేద బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచిన నాయకుడు వంగవీటి రంగా అని, అందువల్ల వంగవీటి రంగా పేరును ఒక జిల్లాకు పెట్టడంతో పాటు అమరావతి ప్రాంతంలో స్మారక స్థూపం ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు అన్నారు. స్థానిక మారుతీ సెంటర్‌లోని వంగవీటి రంగ విగ్రహం వద్ద గురువారం రంగా 77వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వంగా నరసింహారావు, వై వెంకట రత్నం, మాజీ ఎమ్మెల్సీలు అంగర రామమోహన్, మేకా శేషుబాబు, మండెల రజనీ తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ: పెనుగొండలో కాపు నాయకులు రంగా విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కూనపరెడ్డి లక్ష్మయ్య నాయుడు, నక్కా వేద వ్యాస శాస్త్రి, మద్దింశెట్టి వెంకటేష్, కటికిరెడ్డి నానాజీ, వేండ్ర రాము, సల్లాది రాఘవ, చిట్నీడి రాము, కానూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆచంట: వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా అభిమానులు రంగా విగ్రహానికి, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించారు.

భీమవరం అర్బన్: భీమవరంలోని తహసీల్దార్ కార్యాలయం సెంటర్‌లోని వంగవీటి విగ్రహానికి కాంగ్రెస్ ఇన్‌చార్జి అంకెం సీతారాం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సోము నాగ కేశవబాబు, బోనం రవికుమార్, సోడదాసి సైల్వియ, ఏవీ రాము, మద్దల రాము పాల్గొన్నారు.

అత్తిలి: వంగవీటి మోహనరంగా 77వ జయంతిని జనసేన మండల పార్టీ అధ్యక్షుడు దాసం ప్రసాద్ ఆధ్వర్యంలో అత్తిలిలో గురువారం ఘనంగా నిర్వహించారు. సంత మార్కెట్ సెంటర్‌లో ఉన్న రంగా విగ్రహానికి పూల మాలలు వేశారు. కాపు యువత రక్తదానం చేశారు.

ఇరగవరం: జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు చుక్కా సాయిబాబు, ఉభయగోదావరి జిల్లాల జనసేన నాయకులు అనుకూల రమేష్, పసుపులేటి అబ్బులు, తోట మణికంఠ, టీడీపీ నాయకులు మానే భాస్కరరావు, కామన రాంబాబు, అడ్డాల మోంటారావు, తదితరులు రంగా చిత్రపటాల వద్ద నివాళులు అర్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెంటపాడు, జూలై 4: మరమ్మతుల నిమిత్తం పెంటపాడు, ముదునూరు, ఆకుతీగపాడు, కె.పెంటపాడు, పరిమెళ్ళ, యానాలపల్లి, పడమరవిప్పర్రు గ్రామాలలో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరుకూ విద్యుతు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ డీఈ వెంకటేశ్వరరావు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి

పెంటపాడు , జూలై 4 : జిల్లా కలెక్టర్ నాగరాణిని గురువారం బొలిశెట్టి శ్రీనివాస్ కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి మాట్లాడుతూ నియోజకర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈయన వెంట మున్సిపల్ ఇంచార్జి కమిషనర్ మురళికృష్ణ ఉన్నారు.

డీఆర్‌జీలో అడ్మిషన్లు

పెంటపాడు, జూలై 4 : స్థానిక డీఆర్ గోయింకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. కళాశాలలో బీఏ, బీఎస్సీ హానర్స్ బీకాం కంప్యూటర్స్, జువాలజీ మేజర్, మాథ్స్ మేజర్ , కెమిస్ట్రీ మేజర్, ఎకనామిక్స్ మేజర్స్‌లలో విద్యార్థులు చేరవచ్చని, మరిన్ని వివరాలకు కళాశాల లో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రం లో సంప్రదించాలని కోరారు.

శ్మశాన వాటికలో తుప్పలు తొలగింపు



తాడేపల్లిగూడెం రూరల్, జూలై 4 : కొండ్రుపోలు శ్మశాన వాటికను జనసైనికులు శుభ్రం చేశారు. ఏళ్ళ తరబడి తుప్పలు, చెత్తతో ఆ ప్రాంతం ఉండడంతో జనసైనికులు వాటిని తొలగించే పనికి నడుం కట్టారు.

రేపు శునకాలకు వ్యాధి నిరోధక టీకాలు

అత్తిలి, జూలై 4 : జూనోసిస్ డే సందర్భంగా ఈ నెల ఆరున అత్తిలి ప్రాంతీయ పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలు, వీధి కుక్కలకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తామని పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ కె.నరసింహారావు గురువారం తెలిపారు.

రేపటి నుంచి వారాహి నవరాత్రులు

మొగల్తూరు, జూలై 4: మోళ్ళపర్రు కనకదుర్గాబీచ్‌లో దశావతార మత్స్యనారాయణస్వామి అష్టలక్ష్మీ సమేత ఆదిలక్ష్మీ అమ్మవార్ల ఆలయంలో ఈనెల 6వ తేది నుంచి 16 వరకు వారాహి నవరాత్రుల కార్యక్రమం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి సన్నిధిలో నిర్వహించే ఈపూజా కార్యక్రమాల్లో నక్షత్ర దోషాలు, కార్యసిద్ధి దుష్టగ్రహ నివారణకు ప్రతీ రోజూ విశేషార్చనలు చేస్తారన్నారు. ఆఖరి రోజైన 16వ తేదిన ఉదయం నుంచి శాంతి హోమం, పూర్ణాహుతి ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

ఎంపీపీ సూర్యకుమారికి సన్మానం

ఆచంట, జూలై 4: పెనుమంచిలి ఇసుక గరువు ఎంపీపీ స్కూలుకు నిధులు మంజూరు చేయించిన ఎంపీపీ దిగుమర్తి సూర్య కుమారిని గురువారం స్కూలు ఆవరణంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ గణేషుల శేషవాణి, ఎంఈవో, ఎంపీటీసీ వెంకట లక్ష్మి మోహనరావు, ఉమ్మడి కూటమి నాయకులు, పాల్గొన్నారు.

లైబ్రేరియన్ పోస్టులు డీఎస్సీలో చేర్చాలి



మొగల్తూరు, జూలై 4: రానున్న డీఎస్సీలో లైబ్రేరియన్ పోస్టులు చేర్చాలని మొగల్తూరుకు చెందిన ఏపీ లైబ్రరీ సైన్స్ నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ మేకా రమేష్ గురువారం రాష్ట్ర మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పబ్లిక్ లైబ్రరీ, యూనివర్సిటీలు, జూనియర్ కళాశాలలు, ఉన్నత పాఠశాలల్లోనూ లైబ్రేరియన్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

రేపు ఉచిత రేబిస్ టీకాలు

మొగల్తూరు, జూలై 6: ఈనెల 6వ తేదీ ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్టు మండల పశువైద్యాధికారి గొట్టుముక్కల నీలిమ తెలిపారు. శనివారం మొగల్తూరు ఆసుపత్రి వద్ద ఉదయం నుంచి పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి సోకకుండా ఉచితంగా టీకాలు వేస్తామన్నారు.

కొండలరాయుడికి అభిషేకం

అత్తిలి, జూలై 4 : గంటా వారి పుంతలో గల కొండలరాయుడు స్వామికి మాస శివరాత్రి సందర్భంగా గురువారం ఆలయ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డీఎన్ఆర్ వ్యవస్థాపక దినోత్సవం

భీమవరం ఎడ్యుకేషన్, జూలై 4 : దంతులూరి నారాయణరాజు 79వ వ్యవస్థాపక దినోత్సవాన్ని కళాశాల ప్రాంగణంలో గురువారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో గల దంతులూరి నారాయణరాజు విగ్రహానికి, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి కళాశాల పాలకవర్గ అధ్యక్షులు గోకరాజు వెంకట నరసింహరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణరాజు ఆశయాలకు లోబడి నేటి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశలో అనేక కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నామన్నారు. పాలకవర్గ ఉపాధ్యక్షులు గోకరాజు పాండురంగరాజు, సంయుక్త కార్యదర్శి కె రామకృష్ణంరాజు, అసిస్టెంట్ సెక్రటరీ కె శివరామరాజు, ట్రెజరర్ కెవిఎస్ నారాయణ పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్

ఉండి, కాళ్ల, జూలై 4: నీట్ పరీక్ష పేపర్ లీకేజీని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. గురువారం మండలంలోని విద్యా సంస్థలను మూసివేశారు. మండల ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు చందు, గానాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: ఐక్య విద్యార్థి సంఘాలు నిర్వహించిన విద్యా సంస్థల బంద్ తాడేపల్లిగూడెంలో విజయవంతమైంది. కళాశాలలు, పాఠశాలలో స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రూపా శంకర్, విద్యార్థి సంఘం నాయకులు శ్రీనివాసరాజు, జీ.రాజేష్,లక్ష్మణ్ పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: పట్టణ, మండలంలో ఎస్ఎఫ్ఐ చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు మూతపడ్డాయి. ఉదయం నుంచి ఎస్ఎఫ్ఐ నాయకులు మూడు బృందాలుగా విడిపోయి పట్టణంలో తిరుగుతూ స్కూళ్లు, కాలేజీలు తెరవకుండా మూయించివేశారు. నీట్ పరీక్షల అవకతవకలపై విచారణ జరిపి నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు.